క్లుప్తంగా

డిగ్రీ కళాశాలకు న్యాక్ బీ గ్రేడ్



కళాశాల అభివృద్ధికి రూ.55 వేలు విరాళమిచ్చిన దాత చంద్రశేఖర్‌ను సత్కరిస్తున్న అధ్యాపకులు

కోవెలకుంట్ల: పట్టణంలోని వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు న్యాక్ (నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్) బీ గ్రేడ్ ప్రకటించినట్లు ప్రిన్సిపాల్ వేణుగోపాల్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీ గ్రేడ్ సాధించడం కళాశాల అభివృద్ధికి మైలు రాయి అన్నారు. కళాశాల అధ్యాపకులు, పూర్వ విదార్థుల సమష్టి కృషి వల్లే ఈ విజయం సాధ్యమైందని పేర్కొన్నారు. న్యాక్‌బృందం పర్యటన సందర్భంగా కళాశాల అభివృద్ధికి రూ. 1.05 లక్షలు విరాళం అందజేసిన పట్టణానికి చెందిన సన్నిధి చంద్రశేఖర్, కళాశాల రిటైర్డ్ అధ్యాపకుడు మల్కిరెడ్డి వెంకటేశ్వరరెడ్డిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో న్యాక్ సమన్వయకర్త ఈవీ భాస్కర్ రెడ్డి, అధ్యాపకులు వెంకటేశ్వరరెడ్డి, రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గడ్డివాములు దగ్ధం



కాలిపోయిన గడ్డివాములు

ప్యాపిలి: మండల పరిధిలోని పెద్దపొదిళ్ల గ్రామంలో మంగళవారం నాలుగు గడ్డివాములు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన బెస్త కిష్టయ్య, బెస్త చంద్రశేఖర్ తమ పొలంలో గడ్డివాములను వేసుకున్నారు. ప్రమాదవశాత్తు నిప్పు అంటుకోవడంతో మంటలు వ్యాపించాయి. దీంతో నాలుగు గడ్డివాములు పూర్తిగా దగ్ధమయ్యాయి. ప్రమాదంలో రూ.లక్ష వరకు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు వాపోయారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ బాధిత రైతులకు రూ. 10 వేలు ఆర్థికసాయం అందజేశారు.

బనగానపల్లె రూరల్: మండలంలోని మిట్టపల్లె గ్రామ సమీపంలో గడ్డివామి దగ్ధమైంది. వివరాలు.. గ్రామానికి చెందిన దస్తగిరి సుమారు రూ.10వేల విలువ చేసే పశుగ్రాసాన్ని నిల్వ ఉంచుకున్నాడు. మంగళవారం హఠాత్తుగా మంటలు చెలరేగడంతో స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. బనగానపల్లె అగ్నిమాపకశాఖ లీడింగ్ ఫైర్ ఆఫీసర్ ఈశ్వర్‌నాయక్ ఆధ్వర్యంలో సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు.

తైక్వాండో పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న కోచ్

బేతంచెర్ల: కాకినాడలోని జేఎన్‌టీయూ ఇండోర్ స్టేడియంలో జనవరి 31వ తేదీ నుంచి ఫిబ్రవరి 2 తేదీ వరకు జరిగిన రాష్ట్ర స్థాయి తైక్వాండో చాంపియన్ షిప్ పోటీల్లో బేతంచెర్ల విద్యార్థులు ప్రతిభ చాటారు. జయ ప్రతిక్, పూర్ణేంద్ర వెండి పతకాలు, దివ్యశ్రీ, దినేష్ కాంస్యం, వినూక్, కుషాల్ త్రివేద్ రెడ్డి, నోయల్ రన్నర్‌గా నిలిచారని కరాటే కోచ్ నాగన్న, మాస్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. విద్యార్థులను అభినందించారు.

శిథిలావస్థకు చేరిన ట్యాంకు కూల్చివేత



ఓవర్‌హెడ్ ట్యాంకును కూల్చి వేస్తున్న దృశ్యం

కోవెలకుంట్ల: మండలంలోని రేవనూరులో నీటికుంట గట్టుపైన శిథిలావస్థకు చేరిన ఓవర్ హెడ్ ట్యాంకును మంగళవారం అధికారులు కూల్చివేశారు. ఏళ్ల కాలం నాటి ట్యాంకు నిరుపయోగంగా మారి పడిపోయేందుకు సిద్ధంగా ఉండడంతో ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోకుండా ముందు జాగ్రత్తగా జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ప్రొక్లెయిన్ సాయంతో కూల్చివేసినట్లు ఈఈపీఆర్డీ ప్రకాష్‌నాయుడు తెలిపారు.

13న సాయిబాబా విగ్రహ ప్రాణప్రతిష్ట



మాట్లాడుతున్న కమిటీ సభ్యులు

డోన్ టౌన్: పట్టణ సమీపంలో నూతనంగా నిర్మించిన షిర్డీ సాయిబాబా ఆలయంలో ఈ నెల 13న బాబా విగ్రహానికి ప్రాణప్రతిష్ఠ చేస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు సీఎం శ్రీనివాసులు, కందుకూరు పార్థ, ఆలా మల్లికార్జునరెడ్డి తెలిపారు. మంగళవారం ఆలయంలో వారు మాట్లాడుతూ.. ఈ నెల 9 నుంచి 13వ తేదీ వరకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

డిజిటల్ సేవల పరుగులు

- కరెన్సీ నోట్లొద్దు.. డిజిటలే ముద్దు
- కిల్లీ కొట్టు నుంచి షాపింగ్ మాళ్ల వరకు అంతా డిజిటల్ చెల్లింపులే
- అన్ని షాపుల్లో క్యూఆర్ కోడ్‌ల దర్శనం
- నోట్ల కష్టాలకు చెక్
- అప్రమత్తత లేకపోతే గుల్లే



క్యూఆర్‌కోడ్ స్కాన్ ద్వారా నగదు లావాదేవీలు జరుపుతున్న వినియోగదారులు

కోవెలకుంట్ల: పెద్ద నోట్ల రద్దు అనంతరం మారుతున్న కాలానికనుగుణంగా వచ్చిన సాంకేతికను అందిపుచ్చుకుని పల్లెలు, పట్టణాలు డిజిటల్ మనీ దిశగా పరుగులు పెడుతున్నాయి. వినియోగదారులు చిన్న మొత్తం నుంచి పెద్ద మొత్తం వరకు ఆన్‌లైన్ చెల్లింపుల ద్వారానే లావాదేవీలు కొనసాగిస్తున్నారు. చిల్లర సమస్య తలెత్తకుండా డిజిటల్ ప్రక్రియ ద్వారా చెల్లింపులు చేస్తున్నారు. నంద్యాల జిల్లాలోని 29 మండలాల పరిధిలో 21 లక్షల జనాభా ఉండగా దాదాపు 2 లక్షలకు పైగా వ్యాపార సముదాయాలున్నాయి. పట్టణాలు, గ్రామాలు, మారుమూల పల్లెల్లో సైతం ఆన్‌లైన్‌లో నగదు చెల్లింపులు జరుగుతున్నాయి. కిరణాకొట్లు, కిల్లిబంకులు, వస్త్ర దుకాణాలు, మెడికల్ షాపులు, బంగారు షాపులు, పెట్రోల్ బంకులు, స్వీట్ షాపులు, చివరకు బస్సు, రైలు ప్రయాణికులు సైతం డిజిటల్ మనీ ద్వారా లావాదేవీలు నిర్వహిస్తున్నారు. ఎక్కడికెళ్లినా క్యూఆర్ కోడ్‌లు అందుబాటులో ఉండడంతో ఫోన్ ద్వారానే చెల్లింపులు జరుపుతున్నారు.

పరుగులు పెడుతున్న డిజిటల్ మనీ సేవలు

దాదాపు అన్ని షాపుల్లో క్యూఆర్ కోడ్లు, ఫోన్‌పే, పేటీఎం, స్వైపింగ్, పీఓఎస్ యంత్రాలు దర్శనమిస్తున్నాయి. ప్రజలు తమ ఆండ్రాయిడ్, యాపిల్ ఫోన్లలో ఈ యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకుని చిటికెలో చెల్లింపులు జరుపుతున్నారు. జిల్లాలో ప్రతి రోజు రూ. 100 కోట్లకు పైగా ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు జరుపుతున్నట్లు అంచనా. గతంలో రూపాయి, రెండు, ఐదు రూపాయల కాయిన్లకు డిమాండ్ ఉండేది. హోటళ్లు, కిరణా దుకాణాల్లో చిల్లర అవసరమున్నా లభ్యత అంతంత మాత్రంగానే ఉండేది. దీంతో వంద రూపాయల చిల్లర కోసం వ్యాపారులు రూ. 10 కమీషన్ ఇచ్చి మరీ తీసుకునేవారు. జిల్లాలో ఈ తరహాలో వ్యాపారం భారీగా జరిగేది. ప్రస్తుతం చిల్లర అవసరం లేకుండా డిజిటల్ మనీతో చెల్లింపులు చేస్తుండటంతో చిల్లర సమస్యకు చెక్ పడింది.

పెరిగిన ఖర్చులు

డిజిటల్ మనీ వ్యాప్తిలోకి వచ్చాక ఎంత ఉపయోగకరంగా ఉందో అంతే నష్టం సంభవిస్తోంది. గతంలో జేబులో ఎంత డబ్బు ఉందో ఆ మేరకు వినియోగించుకునేవారు. అయితే నగదు చెల్లింపులకు డిజిటల్ సేవలను వాడుతుండడంతో లెక్క లేకుండా ఖర్చు చేస్తున్నారు. క్రెడిట్ కార్డుల్లో ఉన్న మొత్తంతో పాటు ఓవర్ లిమిట్ సౌకర్యం సైతం కల్పిస్తుండడంతో షాపింగ్‌లు, సినిమాలు, షికార్లకు యువత ప్రాధాన్యత ఇస్తోంది. డబ్బును తిరిగి బ్యాంకులకు చెల్లించాల్సిన సమయం వచ్చినప్పుడు ఒత్తిడికి లోనవుతూ అప్పులపాలవుతున్నారు. కుటుంబ అవసరాలకు ఎంతమేర అవసరమో డిజిటల్ మనీ చెల్లింపులకు వినియోగించాలని పలువురు మేధావులు సూచిస్తున్నారు.

అప్రమత్తత లేకపోతే అంతే

వివిధ వస్తువుల కొనుగోలుకు ఆన్‌లైన్ చెల్లింపులు ఎంత పెరిగాయో సైబర్ నేగరాళ్లు అంతేస్థాయిలో విజృంభిస్తున్నారు. లింకులను పంపి వీటిని క్లిక్ చేయాలని ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. ఆన్‌లైన్ చెల్లింపులపై అవగాహన లేని కొందరు ప్రజలు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడుతున్నారు. తెలియకుండా లింకులను క్లిక్ చేసి వారి ఖాతాల్లో నగదును అక్రమార్కులకు అప్పనంగా అప్పగిస్తున్నారు. ఇటీవల కాలంలో జిల్లాలో ఎక్కడో ఒక చోట లింకుల ద్వారా నగదు పోగొట్టుకున్నామని పోలీసులను ఆశ్రయించిన సంఘటనలు చోటు చేసుకున్నాయి. ఇలాంటి సైబర్‌నేరగాళ్లపై అప్రమత్తంగా ఉండాలని పోలీసు అధికారులు సూచిస్తున్నారు.

ఎక్కువ శాతం ఆన్‌లైన్ చెల్లింపులే



పట్టణంలోని గాంధీసెంటర్‌లో నిత్యావసర సరుకుల హోల్‌సెల్‌షాపు నిర్వహిస్తున్నాను. కోవెలకుంట్ల మండలంతోపాటు సంజామల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు, గోస్పాడు, తదితర మండలాల నుంచి వియోగదారులు, చిన్న చిన్న వ్యాపారులు ప్రతి రోజు నిత్యావసర సరుకులను విక్రయించి గూగుల్‌పే, స్వైపింగ్ ద్వారా లావాదేవీలు జరుపుతున్నారు. రోజుకు రూ. 2 లక్షల నుంచి రూ. 4 లక్షల వరకు ఆన్‌లైన్ ద్వారా పేమెంట్ జరుగుతోంది.

–ఇస్కాల ప్రసాద్, వ్యాపారి, కోవెలకుంట్ల

ఫోన్‌పే ద్వారా లావాదేవీలు



గతంలో జేబులో నగదు పెట్టుకుని ఇంట్లోకి కావాల్సిన నిత్యావసర సరుకులు, కూరగాయలు, తదితర అన్ని రకాల వస్తువులు కొనుగోలు చేయాల్సి వచ్చేది. ఫోన్‌పే అందుబాటులోకి వచ్చాక చిల్లర సమస్య తలెత్తకుండా కొన్ని సంవత్సరాల నుంచి డిజిటల్ లావాదేవీలు నిర్వహిస్తూ సరుకులు కొనుగోలు చేస్తున్నాను. డిజిటల్ చెల్లింపులు అందుబాటులోకి రావడంతో దొంగనోట్ల బెడద, చిల్లర సమస్యకు చెక్ పడింది.

–లింగమయ్య, వినియోగదారుడు, కోవెలకుంట్ల

కుష్టు లక్షణాలున్న వారిని గుర్తించాలి

ప్యాపిలి: కుష్టు వ్యాధి లక్షణాలతో బాధపడుతున్న వారిని గుర్తించాలని వైద్యాధికారిణి వాణిశ్రీ అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం ఆశా వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఆశా వర్కర్లు ఇంటింటికి తిరిగి కుష్టు వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో గర్భిణులు, బాలింతల వివరాలు నమోదు చేయాలన్నారు. క్యాన్సర్ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. క్యాన్సర్ నిర్ధారిత పరీక్షలు చేయించుకునే విధంగా ప్రజలకు తెలియజేయాలన్నారు. వైద్య సిబ్బంది రాఘవేంద్ర గౌడు, గంగాదేవి, మనోహర్ రెడ్డి, ప్రసన్న, శ్రీనివాస్, రోజా పాల్గొన్నారు.

8న రాష్ట్రస్థాయి భజన పోటీలు

ప్యాపిలి: మండల పరిధిలోని పీఆర్ పల్లి గ్రామంలో ఈ నెల 8వ తేదీ రాష్ట్రస్థాయి భజన పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 108వ ఏకాదశి మహోత్సవం సందర్భంగా గ్రామ సమీపంలోని పంచలింగేశ్వర స్వామి దేవస్థానంలో పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. విజేతగా నిలిచిన బృందానికి రూ. 20,016, ద్వితీయ స్థానం రూ.18,016, తృతీయ స్థానంలో నిలిచిన వారికి రూ. 16,016 చొప్పున నగదు బహుమతి ఇస్తామన్నారు. నాలుగో బహుమతితో పాటు మొత్తం 12వ స్థానం వరకు నగదు బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న భజన బృందం ప్రవేశ రుసుం రూ. 300 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 95501 03144 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

10న నులిపురుగుల నివారణ దినోత్సవం



పోస్టర్లను విడుదల చేస్తున్న డాక్టర్లు

కోవెలకుంట్ల: ఈనెల 10వ తేదీ జాతీయ నులి పురుగు నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని రేవనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర డాక్టర్లు విద్యాసాగర్, మహబూబ్ సుభాని అన్నారు. మంగళవారం పీహెచ్‌సీలో పోస్టర్లను విడుదల చేశారు. నేషనల్ డీవార్మింగ్ డేను పురస్కరించుకుని మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏడాది నుంచి 19 ఏళ్లలోపు పిల్లలందరికీ నులిపురుగు నివారణ మందులు వేస్తామన్నారు. వివిధ కారణాలతో 10వ తేదీ మందులు వేయించుకోని పిల్లలకు ఈ నెల 17వ తేదీ వేస్తామని పేర్కొన్నారు. హెల్త్ సూపర్‌వైజర్లు ప్రభావతి, గిరిజ, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలకు టేబుల్స్ విరాళం

డోన్: స్థానిక జ్యోతిరావు పూలే ఉన్నత పాఠశాల, కళాశాలకు ఇన్నర్ వీల్ క్లబ్ తరుపున రూ.10 వేల విలువ చేసే రెండు టేబుల్స్‌ను మంగళవారం విరాళంగా అందజేశారు. తుగ్గలి మండలం మారెళ్ల గ్రామానికి చెందిన దాతలు రాజశేఖర్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి ఆర్థిక సహాయంతో వీటిని అందజేసినట్లు క్లబ్ సభ్యులు శకుంతలారెడ్డి తెలిపారు.

ఉపకారవేతనానికి ఎంపిక

- ఈఈఎంటీ పరీక్షలో విద్యార్థిని ప్రతిభ



ఈఈఎంటీలో ప్రతిభ చాటిన విద్యార్థినిని అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

బనగానపల్లె రూరల్: స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని టి.షణ్ముఖశ్రీ రాష్ట్ర స్థాయి ప్రతిభా ఉపకారవేతనాలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం బాలగంగాధర్‌రెడ్డి తెలిపారు. విద్యార్థుల్లో ప్రతిభను ప్రోత్సహించేందుకు ఇటీవల ఎడ్యుకేషనల్ ఎపిఫనీ స్వచ్ఛంద సంస్థ నిర్వహించిన ఆన్‌లైన్ మెరిట్ టెస్ట్(ఈఈఎంటీ)లో షణ్ముఖశ్రీ జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచి రూ.8 వేల ఉపకార వేతనానికి అర్హత సాధించిందని చెప్పారు. ఈ నెల 8వ తేదీ విజయవాడలో జరిగే కార్యక్రమంలో ఉపకారవేతనం అందుకోనున్నట్లు తెలిపారు. విద్యార్థినిని హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

కమిషనర్‌ను కలిసిన మైనార్టీ కమిటీ సభ్యులు



పంచాయతీ కమిషనర్‌ను సత్కరిస్తున్న మైనార్టీ కమిటీ సభ్యులు

బేతంచెర్ల: పట్టణ ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ కమిటీ సభ్యులు సీఐ వెంకటేశ్వరరావు, నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్‌ను మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. కొలుములపల్లె రహదారిలో ఉన్న ఈద్గాకు కాంపౌండ్ సరిగ్గా లేదని, లైట్లను ఏర్పాటు చేయాలని కోరారు. రంజాన్ నెలలో ఉపావాస దీక్షలు చేపట్టే వారికి అన్నదానం చేస్తారని, మసీదుల వద్ద చెత్త కుండీలను ఏర్పాటు చేయాలని కమిషనర్‌కు విన్నవించారు. అనంతరం సీఐ, కమిషనర్‌ను సత్కరించారు. బేతంచెర్ల ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ కమిటీ అధ్యక్షుడు ఖాజా హుసేన్, ఉపాధ్యక్షుడు వలీబాషా, సభ్యులు కరిముల్లా, జుబేర్, సలాం, షేక్షా, సద్దాం పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం



మాట్లాడుతున్న సీడీపీఓ షంషాద్‌బేగం

డోన్ రూరల్: బాల్యవివాహాలు జరగకుండా చూడాలని ఐసీడీఎస్ సీడీపీఓ షంషాద్‌బేగం వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లకు సూచించారు. మండల పరిధిలోని కొత్త బురుజు ప్రాథమిక వైద్యశాలలో మంగళవారం బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ, డాక్టర్ రాంభూపాల్ మాట్లాడుతూ.. డోన్ ప్రాజెక్ట్ పరిధిలో ఎక్కువగా బాల్యవివాహాలు జరుగుతున్నాయని, నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. బాల్య వివాహాల వల్ల మానసికంగా, శారీరకంగా ఎన్నో సమస్యలు వస్తాయనే విషయాన్ని ప్రజలకు తెలియజేయాలని సూచించారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని.. శిక్షార్హులవుతారని తెలిపారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పద్మావతి, శోభారాణి, హెల్త్ సూపర్‌వైజర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పట్టు పరిశ్రమకు ప్రోత్సాహకాలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా పట్టుపరిశ్రమ అధికారి

బనగానపల్లె: పట్టు సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తోందని.. రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పట్టుపరిశ్రమ అధికారిణి పరమేశ్వరి అన్నారు. మంగళవారం మండలంలోని తమ్మడపల్లె గ్రామంలో రైతులతో సమావేశం నిర్వహించారు. పట్టు పరిశ్రమను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రాయితీపై షెడ్లు, మొక్కలను ఏర్పాటు చేయిస్తోందని తెలిపారు. కాగా వెంకటాపురం గ్రామంలో ఏఓ సుబ్బారెడ్డి, మార్కెటింగ్ సొసైటీ అధికారి శంకర్ కందుల శాంపిల్స్ సేకరించి తేమ శాతాన్ని పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన తేమ శాతం ఉండడం వల్ల ఈ నెల 6వ తేదీ నుంచి క్వాంటా రూ.7,550తో కొనుగోలు చేస్తామని తెలిపారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

బేతంచెర్ల: జబ్బుల బారిన పడకుండా ఉండాలంటే మంచి అలవాట్లు, ఆహారం ముఖ్యమని వైద్యురాలు సాగరిక, వాణి స్వప్న ప్రియ అన్నారు. మంగళవారం పట్టణంలోని శేషారెడ్డి సీహెచ్‌సీలో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. క్యాన్సర్‌ను ఏ విధంగా గుర్తించాలి, వాటి లక్షణాలు, ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటును తెలియజేశారు. నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భశాయ క్యాన్సర్‌పై ఆస్పత్రిలో నిర్వహించే పరీక్షల గురించి పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

రేపు చేతివృత్తిదారుల సమాఖ్య సమావేశం

డోన్ రూరల్: నంద్యాలలో ఈనెల 6వ తేదీ నిర్వహించనున్న చేతివృత్తిదారుల సమాఖ్య సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా సమాఖ్య ప్రధాన కార్యదర్శి రామ్మోహన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథిగా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామాంజినేయులు, సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.రంగనాయుడు, సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్ హాజరవుతున్నారని తెలిపారు.

ఆలయానికి విరాళం

బనగానపల్లె రూరల్: మండలంలోని పలుకూరులో ఉన్న వీరభద్రస్వామి ఆలయానికి గ్రామానికి చెందిన తెలుగు బాలగంగాధర్ మంగళవారం రూ.5 వేల విరాళాన్ని అందజేసినట్లు ఆలయ అర్చకుడు భాస్కరయ్య తెలిపారు. స్వామివారి దీపారాధన ఖర్చుల కోసం వినియోగించనున్నట్లు చెప్పారు. దాతకు కృతజ్ఞతలు తెలిపారు.

విదేశీ బీమా కంపెనీలతో భద్రతకు ముప్పు

డోన్ టౌన్: విదేశీ బీమా కంపెనీలు దేశభద్రతకు, ప్రజల సమాచార గోప్యతకు ముప్పు అని ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం నాయకులు రహంతుల్లా, కిరణ్ కుమార్, రాఘవయ్య ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక ఎల్ఐసీ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. కేంద్ర బడ్జెట్‌లో బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడిని 74 శాతం నుంచి 100 శాతానికి పెంచడం తగదన్నారు. ఎల్ఐసీకి స్వయం ప్రతిపత్తి ఇవ్వాల్సిన కేంద్ర ప్రభుత్వం ఇందుకు భిన్నంగా వ్యవహరించడం దారుణమన్నారు. కార్యక్రమంలో శేషయ్య, సురేశ్, హరిరావు, హరిప్రసాద్, కళ్యాణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


బేతేశ్వరుడికి పంచలోహ నాగాభరణం



పంచలోహ నాగాభరణం

బేతంచెర్ల: పట్టణంలోని గౌరిపేటలో వెలసిన బేతేశ్వర శివలింగానికి గూటుపల్లె గ్రామానికి చెందిన భక్తులు కిరణ్, శ్రీకాంత్ 15 కేజీల పంచలోహ నాగాభరణంను విరాళంగా అందజేశారు. ఆలయ అర్చకుడు ప్రభాకర్‌శర్మ, నిర్వాహకులు గుండా గోపాలు, ఈశ్వర్ ప్రసాద్ దాతలకు కృతజ్ఞతలు తెలిపి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

సిద్ధేశ్వరస్వామి ఆలయంలో మెట్ల పూజ



బేతంచెర్ల: పట్టణంలోని సిద్ధేశ్వరస్వామి ఆలయంలో శివ గురుస్వాములు మనోహర్‌నాయుడు, కుమార్ ఆధ్వర్యంలో మెట్ల పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వినాయక, ఈశ్వరుడు, సుబ్రమణ్యేశ్వరస్వామి చిత్ర పటాలకు ప్రత్యేక పూజలు చేశారు.

బనగానపల్లెలో చోరీ



చెల్లాచెదురుగా పడివున్న వస్తువులు

బనగానపల్లె రూరల్: పట్టణంలోని అవుకుమెట్ట బిల్డింగ్ కాలనీలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. వివరాలు.. స్థానికంగా నివాసం ఉంటున్న పోలూరు వెంకటకృష్ణ సోమవారం కుటుంబ సభ్యులతో కలిసి నంద్యాలలో బంధువుల వివాహానికి వెళ్లారు. ఆయన కుమారుడు ఒక్కడే ఇంట్లో ఉన్నాడు. సోమవారం రాత్రి కింది ఇంటికి తాళం వేసి సెకండ్ ఫ్లోర్‌లో సాగర్ నిద్రించాడు. దుండగులు తాళం పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. బీరువాలో ఉంచిన రూ.80 వేల నగదు, ఒకటిన్నర తులం బంగారం, 20 తులాల వెండి అభరణాలు చోరీ చేశారు. సాగర్ నిద్రిస్తున్న గదికి గడియ పెట్టి తమ పని కానించారు. అనంతరం ఇంట్లో ఉన్న కోడి గుడ్లతో ఆమ్లేట్ వేసుకుని తిని అక్కడి నుంచి వెళ్లారు. మంగళవారం జరిగిన విషయం గుర్తించిన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నేటితో ముగియనున్న గడువు



సమావేశంలో మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ తకీబాషా

కోవెలకుంట్ల: గీత కార్మికులకు(ఈడిగ) మద్యం దుకాణాలు కేటాయించేందుకు దరఖాస్తుల స్వీకరణకు బుధవారం వరకు గడువు ఉందని ఎక్సైజ్ సీఐ తకీబాషా తెలిపారు. స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌లో మంగళవారం గీత కార్మికులు దరఖాస్తు చేసుకునే విధానంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో గీత కార్మికులకు 11 మద్యం దుకాణాలు కేటాయించగా కోవెలకుంట్ల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఉయ్యాలవాడ మండలానికి ఒక దుకాణం కేటాయించారన్నారు. రూ.2 లక్షల (నాన్ రీఫండబుల్) రుసుం చెల్లించి కుల, స్వస్థల ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బుధవారం సాయంత్రంతో దరఖాస్తుల స్వీకరణకు గడువు ముగుస్తుందన్నారు. ఈ నెల 7వ తేదీ కలెక్టర్ కార్యాలయంలో లాటరీ పద్ధతిలో షాపులు కేటాయిస్తామన్నారు. ఎస్ఐలు సందీప్‌కుమార్, ప్రవీణ్‌కుమార్ నాయక్ ఉన్నారు.

దరఖాస్తులకు నేడు చివరి తేదీ

డోన్ రూరల్: కల్లుగీత కార్మికులు మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకోవడానికి బుధవారం ఆఖరు రోజు అని ఎక్సైజ్ సీఐ వరలక్ష్మి తెలిపారు. ఆ శాఖ కార్యాలయంలో మంగళవారం ఆమె మాట్లాడారు. డోన్‌కు రెండు షాపులు కేటాయించారని.. ఇంత వరకు ఒక్క దరఖాస్తు రాలేదని తెలిపారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

180 లీటర్ల కల్లు స్వాధీనం

డోన్ మండలం ఉడుములపాడులో కృష్ణగిరి మండలం కంబలపాడు గ్రామానికి చెందిన ఈడిగ మహేష్ అక్రమంగా కెమికల్ కలిపిన కల్లు అమ్ముతుండగా అరెస్టు చేసినట్లు తెలిపారు. అతని వద్ద నుంచి 180 లీటర్ల కల్లు, 120 గ్రాముల క్లోరల్ హైడ్రేట్, ఆటోను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఎస్ఐలు సోమశేఖర్‌రావు, పి.దౌలత్‌ఖాన్ ఉన్నారు.

పథకాల అర్హతకు ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి



రైతు సేవా కేంద్రంలో వివరాలు నమోదు చేసుకుంటున్న రైతులు

కోవెలకుంట్ల: కేంద్ర ప్రభుత్వం అందించే పీఎం కిసాన్ పథకానికి అర్హత సాధించాలంటే రైతులు ఆయా రైతు సేవా కేంద్రాల్లో వివరాలు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి నిరంజన్ సూచించారు. మండలంలోని బిజనవేములలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఏఓ మాట్లాడుతూ.. డిజిటల్ అగ్రికల్చర్‌లో భాగంగా ఫార్మర్స్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, మొబైల్ నంబర్ తీసుకెళ్లి రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ అనంతరం ఆధార్ తరహాలో 14 అంకెల గుర్తింపు సంఖ్య కేటాయిస్తారని తెలిపారు.

రథసప్తమి వేడుకలు



ప్రత్యేక అలంకరణలో సూర్యనారాయణుడు

అవుకు: రథ సప్తమిని పురస్కరించుకుని అవుకు సూర్యనారాయణ స్వామి దేవాలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. స్వామివారి పాదాలను సూర్యకిరణాలు తాకడాన్ని చూసి పరవశించిపోయారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చెక్క భజనలు, కోలాటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భక్తులకు అన్నదానం చేశారు.



అక్షరాలతో రథం ఆకారం

రథసప్తమిపై విద్యార్థులకు అవగాహన

కొలిమిగుండ్ల: రథసప్తమి సందర్భంగా అంకిరెడ్డిపల్లె మెయిన్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పండుగ ప్రాముఖ్యతను ఉపాధ్యాయులు వివరించారు. తెలుగు, ఇంగ్లిష్, గణితం,సైన్స్ సబ్జెక్టుల్లోని అక్షరాలతో రథం ఆకారంలో బొమ్మను గీశారు. బొమ్మలో ఉన్న సబ్జెక్ట్‌ల గురించి విద్యార్థులతోనే పలికించి సులభంగా అర్థమయ్యేలా వివరించారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి



కాటసాని రామిరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

బనగానపల్లె: కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి వైఎస్సార్‌సీపీ నాయకులకు సూచించారు. ఆ పార్టీ నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా నియమితులైన ఇటిక్యాల పుల్లయ్య, ఎస్సీ సెల్ విభాగం అధ్యక్షుడు గోపాజి సత్యం, మహిళా విభాగం అధ్యక్షురాలు షేక్ షాహజహాన్ మంగళవారం వేర్వేరుగా కాటసానిని ఆయన నివాసంలో కలిశారు. కృతజ్ఞతలు తెలిపి పూలమాలలు, శాలువాలు వేసి సత్కరించారు.